## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

**ఆదిలాబాద్‌టౌన్:** మేరు సంఘం ఆదిలాబాద్ పట్టణ కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని విఠల్ రుకుంబాయి మందిరంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలిపెల్లి నాందేవ్, ప్రధాన కార్యదర్శిగా కర్నేవార్ రాకేష్, కోశాధికారిగా గజానంద్‌లతో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

### ఘనంగా ధ్యానమందిరం వార్షికోత్సవం



ధ్యానం చేస్తున్న గ్రామస్తులు

**బేల:** మండలంలోని సోన్‌కాస్ గ్రామంలో ఆధ్యాత్మిక గురువు పులాజీబాబా ధ్యాన మందిరం 24వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువుల చిత్రపటాలు, గ్రంథాలకు పులాజీబాబా ప్రధాన శిష్యబృందం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో రెండు నిమిషాల పాటు ధ్యానం చేయించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం జనార్దన్, ధ్యాన మందిరం నిర్వాహకులు గుర్నులే సతీశ్, సిండే నందకిశోర్, సిడాం ఈశ్వర్‌దాస్ పాల్గొన్నారు.

### ఎన్నికల శిక్షణ పత్రాలు అందజేత

**తాంసి:** ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. దీనిలో భాగంగా సిబ్బందికి శిక్షణను ఇవ్వనున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు శిక్షణ పత్రాలు అందజేశారు.

### సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు

**ఉట్నూర్‌రూరల్:** బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస యాదవ్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని, అభ్యర్థులను గెలిపించాలని మంత్రి కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. నాయకులు ముజీబ్, జుబేర్ ఖాన్, మహేందర్, అబ్రార్ అహ్మద్, బిట్టులు పాల్గొన్నారు.

### గడపగడపకూ ధర్మస్వరాజ్ పార్టీ

**బోథ్:** మండల కేంద్రంలో ధర్మస్వరాజ్ పార్టీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యాధికారం కోసం పార్టీ ఆవిర్భవించిందన్నారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి, అభ్యర్థి ఉయికే ఉమేష్‌ను గెలిపించాలని కోరారు. బీసీలకు ఏ పార్టీ టికెట్లు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### దుప్పట్లు పంపిణీ

**బోథ్:** మండల కేంద్రానికి చెందిన ఆలంబన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికి ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు బారె భూషణ్, రూపేష్, మురళీ, ఉమేందర్, బారె నవీన్, కటకం గణేష్, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి చేయూత



సరుకులు అందజేస్తున్న నాయకులు

**తాంసి:** మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి జిల్లా మాల సంఘం నాయకులు అండగా నిలిచారు. పొన్నారి గ్రామానికి చెందిన రాజనాల శ్రీధర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబానికి ఆదివారం రూ.37వేల విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, సూరం భాగవండ్లు, అల్లూరి భూమన్న, బాబన్న, మేకల మల్లన్న, రఘు పాల్గొన్నారు.

**జైనథ్:** మండలంలోని నిరాల గ్రామానికి చెందిన పంద్రే సుభాష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా.. పర్ధాన్ సంఘం సభ్యులు ఆదివారం రూ. 12వేల ఆర్థిక సాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని, సంఘం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పంద్రే గంగా ప్రసాద్, గొడం సునీల్, సిడాం రాకేశ్, దుర్వ అభిమాన్, గణేశ్ పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలతో ఇక్కట్లు

- బేలలో అప్రకటిత విద్యుత్ కోతలు
- ప్రజలకు తప్పని తిప్పలు
- స్పందించని అధికారులు



బేల సబ్‌స్టేషన్

**బేల:** గత 20 రోజులుగా మండలంలో విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరాయం కలుగుతోంది. ప్రతిరోజూ అప్రకటిత కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లోనూ కరెంట్ పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈనెల 15న సాయంత్రం 4 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, రాత్రి 12 గంటలకు పునరుద్ధరించారు. ఈనెల 27న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా లేదు. ఇలా ప్రతిరోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది.

**గంటగంటకు కోతలు..**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. ప్రతీ గంటకోసారి విద్యుత్ కోతలు ఉండడంతో మండల కేంద్రంలోని జిరాక్స్ కేంద్రాలు, హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, హెయిర్ సెలూన్‌లు, బైక్ సర్వీస్ కేంద్రాలు, పిండిగిర్ని వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. గంటల తరబడి సరఫరా లేక ఖాళీగా కూర్చుంటున్నారు. విద్యుత్ కోతలపై సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే పైనుంచి (33 కేవీ లైన్ నుంచి) ఇన్‌కమింగ్ లేదంటూ సమాధానం ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

**అధికారులు స్పందించడం లేదు**



అప్రకటిత కరెంటు కోతలపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించడం లేదు. కరెంట్ పోయినప్పుడు ఫోన్ చేస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. బిల్లుల వసూలులో ఉన్న చిత్తశుద్ధి, సరఫరా చేయడం లేదు.

–బండారి గణేష్, టైలర్, బేల

**కరెంటు వచ్చుడు పోవుడే..**



గత కొద్ది రోజుల నుంచి కరెంటు వచ్చుడు పోవుడే ఉంది. ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఇంటి నిర్మాణ పనులు చేసుకోలేకపోతున్నాం. అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదు.

– గయబాయి, అశోక్‌నగర్ కాలనీ, బేల

# కుల సంఘాల అభివృద్ధికి కృషి



మహారాణా ప్రతాప్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

**ఆదిలాబాద్‌రూరల్:** కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో బొందిలి రాజ్‌పుత్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా మిలన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా మహారాణా ప్రతాప్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. రాణాప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకే తమ పూర్తి మద్దతు ఉంటుందని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు స్వదీప్ సింగ్ ఠాకూర్, కార్యదర్శి సతీష్, విజయ్‌సింగ్, రవిదాస్, రఘునాథ్, దాదారావు పాల్గొన్నారు.

**నిరుపేదలకు అండగా ఉంటాం**

**ఆదిలాబాద్‌టౌన్:** నిరుపేదలకు అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గొడవలు సృష్టించే పార్టీలకు కాకుండా సమాజ అభివృద్ధికి పాటుపడే పార్టీకే ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, అజయ్, అష్రఫ్, అజీమ్, నయీమ్, అన్వర్, మోహిద్ ఖాన్, అలీమ్ పాల్గొన్నారు.

**పార్టీకి కార్యకర్తలే బలం**

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మంత్రి హరీష్‌రావు పాల్గొన్న బహిరంగ సభ విజయవంతమైందన్నారు. బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షాలకు కనీసం డిపాజిట్లు దక్కని పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, అజయ్, బండారి సతీష్, సాజిదొద్దీన్, గంగారెడ్డి, దాసరి రమేశ్ పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో విఫలం

- మహారాష్ట్ర ఎమ్మెల్సీ ప్రవీణ్



ఓటు అభ్యర్థిస్తున్న మహారాష్ట్ర ఎమ్మెల్సీ ప్రవీణ్

**ఆదిలాబాద్‌రూరల్:** సీఎం కేసీఆర్ హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్సీ ప్రవీణ్ దరేకార్ ఆరోపించారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాయల్ శంకర్ మూడుసార్లు ఓటమి చెందినా.. ప్రజల్లో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పాయల్ శంకర్ మాట్లాడుతూ.. జిల్లాలోనే భీంసరి ఆదర్శవంతమైన గ్రామమన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న హామీల ను విస్మరించారని మండిపడ్డారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నాయకులు మయూర్ చంద్రా, కుంచెట్టి సంతోష్, రత్నాకర్ రెడ్డి, చిలుకూరు జ్యోతిరెడ్డి, కార్తీక్, లోక ప్రవీణ్ రెడ్డి, అశోక్ రెడ్డి, రవి రెడ్డి, నరేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

**బీజేపీలో చేరిక**

**ఆదిలాబాద్:** జైనథ్ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి పాయల్ శంకర్ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఆమెతో పాటు పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గణేష్ రెడ్డి, బుర్రి వెంకట్, సురేశ్ పాల్గొన్నారు.

# ఉపాధికి వెళ్లి.. ఆరోగ్యం చెడి

- బెహ్రాయిన్‌లో మంచం పట్టిన నగేశ్
- ఇన్‌ఫెక్షన్‌తో ఆస్పత్రి పాలు
- చేతిలో చిల్లిగవ్వలేక అవస్థలు
- భారత్‌కు వెళ్లేందుకు సాయం చేయాలంటూ వేడుకోలు



బెహ్రాయిన్ ఆసుపత్రిలో పడిగెల నగేశ్

**బోథ్:** మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన పడిగెల నగేశ్ ఇటీవల బెహ్రాయిన్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. అయితే కొద్దిరోజులకే అనారోగ్యం బారినపడి నానా అవస్థలు పడుతున్నాడు. శరీరంలో ఇన్‌ఫెక్షన్ సోకడంతో అక్కడి ఆసుపత్రిలో చేరాడు. వెంటనే చికిత్స చేయాలని అక్కడి వైద్యులు స్పష్టం చేశారు. అయితే చేరిన కంపెనీ మోసం చేయడంతో చేతిలో చిల్లగవ్వలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. కేంద్ర రాయబార కార్యాలయానికి సమాచారం అందేలా చూడాలని వాట్సాప్ ద్వారా కుటుంబ సభ్యులకు నగేశ్ సందేశం పంపాడు. భారత్‌కు తిరిగి రావాలంటే డబ్బులు లేవని, రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఆదుకోవాలని కన్నీటి పర్యంతవుతున్నాడు. అధికారులు నగేశ్‌ను భారత్‌కు రప్పించేలా చర్యలు చేపట్టాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

# 'కాంగ్రెస్ హామీలు నమ్మి మోసపోవద్దు'



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**నేరడిగొండ:** కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకట రమణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లూరి శివారెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని వడూర్, భవానితండా, గంభీర్‌తండా గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనిల్ జాదవ్ ఉన్నారని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు న్యాయం చేశారని అన్నారు. కార్యక్రమంలో వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరి, నాయకులు గాదె శంకర్, ఉప్పు పోశెట్టి, పాల శంకర్, ఆడుముళ్ల భూషన్, మోహన్, నవీన్, రవీందర్, కిరణ్ కుమార్ రెడ్డి, కృష్ణ, ఊశన్న పాల్గొన్నారు.

**ఇచ్చోడ:** కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గేర్జంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిదేళ్లలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, రానున్న ఎన్నికలలో బీఆర్‌ఎస్ అధికారంలో వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, గాడ్గే సుభాష్, తృప్తి గంగాధర్, పాండు, పురుషోత్తరెడ్డి, దయకుమార్‌రెడ్డి, మనోహర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

### రేపు కాంగ్రెస్ సమీక్ష సమావేశం

**కైలాస్‌నగర్:** కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఈనెల 31న మావల మండల శివారులోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకులు కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం11గంటలకు జరిగే సమావేశానికి ఆదిలాబాద్ నియోజకవర్గంలోని నాయకులు, టీపీసీసీ, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

### 'హరీష్‌రావు పర్యటన ట్రైలర్ మాత్రమే'



ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

**కైలాస్‌నగర్:** మంత్రి హరీష్‌రావు ఆదిలాబాద్ పర్యటన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా సీఎం కేసీఆర్‌సభ సమయంలో చూపిస్తామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించారు. జోగు రామన్నను గెలిపించాలని కోరారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల కాలంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రెయినేజీ వసతులు కల్పించినట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కలీం, ఇబ్బు, శరత్, కలీం, గణేష్, చందర్, శ్రీకాంత్, మున్నీ, షీల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సమన్వయకర్తగా అరుణ్‌కుమార్



అరుణ్ కుమార్

**బోథ్:** బోథ్ కాంగ్రెస్ సమన్వయకర్తగా మండలంలోని సొనాల గ్రామానికి చెందిన తుల అరుణ్ కుమార్‌ను ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే నియమించారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలో అభ్యర్థి వన్నెల అశోక్‌ను గెలిపించే దిశగా ప్రచారం చేయాలన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తానని అరుణ్‌కుమార్ అన్నారు.

**యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రవి**

**కైలాస్‌నగర్:** ఆదిలాబాద్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కొండూరి రవి ని యమించారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ చాకలి శైలేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ప్రజాసేవాభవన్‌లో రవికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివా సరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

# పేదల బతుకుల్లో వెలుగులు నింపుతాం

- ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి



పార్టీలో చేరిన యువతులతో సెల్ఫీ తీసుకుంటున్న శ్రీనివాసరెడ్డి

**కైలాస్‌నగర్:** కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల బతుకుల్లో వెలుగులు నింపుతామని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఆదివారం బంగారిగూడ, కైలాస్‌నగర్, భాగ్యనగర్, హమాలీవాడ, ఇందిరానగర్, నెహ్రూచౌక్, డాల్డా కంపెనీ, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న జోగు రామన్న పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరముందన్నారు. ఆదిలాబాద్ లో దోపిడీ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. జోగు రామన్న, పాయల్ శంకర్ ఇద్దరు ఒక్కటేనని, వారిని మళ్లీ నమ్మి మోసపోవద్దన్నారు. భారీ ఎత్తున మద్యం, డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేస్తారని, వారి మాయలో పడవద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, సంతోష్‌రావు, శంకర్, సుజాత్ అలీ, రాజ్ మహమ్మద్, షేక్ మన్సూర్, కొండూరి రవి, మానే శంకర్, తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

# కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న వన్నెల అశోక్

**తాంసి:** కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్ అన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన తరువాత తొలిసారిగా మండలానికి వచ్చిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పొన్నారి హనుమాన్ ఆలయంలో పూజలు చేసి, పొన్నారి, హస్నాపూర్ గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తలమడుగు, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, నర్సయ్య, మండల కన్వీనర్ సంతోష్, రాజేశ్వర్, మల్లేపూల సత్యనారాయణ, రామన్న, వెంకట్ రెడ్డి, మల్లేష్, స్వామి, నారాయణ, వినోద్ రెడ్డి, హన్మండ్లు, నరేశ్ యాదవ్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ**

**తలమడుగు:** అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖోడద, సుంకిడి, ఉండమ్ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఖోడద గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుయ్యడి గ్రామ యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ. 2500 అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లేపూల నర్సయ్య, పోచ్చర సర్పంచ్ మల్లేశ్, బాబాన్న, ప్రకాష్‌రావు, అశోక్, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే సుపరిపాలన

**నేరడిగొండ:** కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుపరిపాలన సాధ్యమని మండల కన్వీనర్ ఎర్రల్ల చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వన్నెల అశోక్ వెళ్తుండగా నేరడిగొండ మండల నాయకులు గుడిహత్నూర్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో కుమారి ఉప సర్పంచ్ గడ్డం నరేశ్‌రెడ్డి, బూర్గుల మల్లేష్, రాంలక్ష్మణ్ గౌడ్, బుక రాములు, కొప్పుల ఊశన్న, మల్లేపూల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# 'నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్'



మాట్లాడుతున్న భిక్షపతి రాథోడ్

**నార్నూర్:** నిరుద్యోగులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు భిక్షపతి రాథోడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో లక్ష ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశాడని ఆరోపించారు. మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయలన్నారు. ఉద్యోగాలు రాక యువత ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ధర్మరక్షక్, శ్రీను, శ్రావణ్, మహేశ్, కిరణ్ పాల్గొన్నారు.

# ఆదరించండి.. అభివృద్ధి చేస్తా




ర్యాలీలో పాల్గొన్న అనిల్ జాదవ్

**బజార్‌హత్నూర్:** నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని బోథ్ నియోజకవర్గం బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని చందునాయక్ తండా, భూతాయి(బి) భూతాయి(కె), కొలాంగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు అనిత, జ్ఞానేశ్వర్, సోము రాంరెడ్డి, విద్యాసాగరా, గంగ నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్, ప్యాక్స్ చైర్మన్ వెంకన్న, చిల్కూరి భూమన్న, అల్కే గణేష్, నానం రమణ, కొత్త శంకర్, నారాయణ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

**బోథ్:** బీఆర్‌ఎస్ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సొనాలలో ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం సొనాలను మండలంగా సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ ప్రథకాలు, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కదం ప్రశాంత్, బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

### సీసీఐని పునరుద్ధరించాలి




మాట్లాడుతున్న నాయకులు

**ఎదులాపురం:** జిల్లా కేంద్రంలోని సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ యూసుఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ పాల్గొన్నారు.